క్లుప్తంగా

సర్పంచ్‌కు పరామర్శ



ధర్మసాగర్ (వేలేరు) : రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి వేలేరు సర్పంచ్ కాయిత మాదవరెడ్డిని పరామర్శించారు. మాధవరెడ్డి ప్రమాదానికి గురై హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం ఆస్పత్రికి చేరుకుని కలిశారు. మాధవరెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పల్లా వెంట ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి, నాయకులు నర్సింగరావు, ఇట్టబోయిన సంపత్, అమర్‌సింగ్, రాజు, తదితరులున్నారు.

ఆత్మకూరు మండలంలో..

ఆత్మకూరు : మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన చిలువేరు అయిలయ్య, కొమ్ముల రమేష్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను సర్పంచ్ సావురే కమల రాజేశ్వర్‌రావు ఆదివారం పరామర్శించారు. రెండు కుటుంబాలకూ ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

తీన్మార్ మల్లన్నపై పోలీసులకు ఫిర్యాదు



శాయంపేట : తీన్మార్ మల్లన్నపై తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్ ఆధ్వర్యంలోని బృందం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీగా ప్రజలకు సేవలు అందిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై తీన్మార్ మల్లన్న అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. మల్లన్నతోపాటు అతని ఛానల్‌పైనా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు చిట్టి రమేష్, జాగృతి నాయకులు మూల మనోజ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 'డబుల్' ఇళ్లు మంజూరు చేయాలి



శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామ ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరుచేయించాలని ఎంసీపీఐ(యూ)రాష్ట్ర కమిటీ నాయకులు పరికిరాల భూమయ్య అన్నారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి లిఖిత పూర్వకంగా వినతిపత్రాన్ని ఆయన అందించారు. ఈకార్యక్రమంలో నాయకులు మొగిళి, నారాయణ, ఈశ్వరమ్మ, సుమన్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి రూ.10 వేల సాయం



ఎల్కతుర్తి : మండలంలోని దండేపల్లి గ్రామానికి చెందిన పేద విద్యార్థి కుక్కమూడి సిద్ధార్థ్‌కు ప్రముఖ సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులరెడ్డి ఆదివారం రూ.10 వేలు సాయం అందించి ఔదార్యం చాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కడు పేదరికంలోనూ బీటెక్ అభ్యసిస్తుండడం పట్ల సిద్ధార్థ్‌ను అభినందించారు. పరీక్ష ఫీజు, స్టడీ మెటీరియల్, ఇతర్రతా అవసరాల కోసం సాయం అందించినట్లు తెలిపారు. పేదరికం కారణంగా ఎవరూ ఉన్నత చదువులకు దూరం కావద్దని కోరారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదిగి పేదలు సామాజిక సేవలు అందించాలని సిద్ధార్థ్‌కు సూచించారు. కార్యక్రమంలో పొన్నాల అశోక్, శ్రీకాంత్, వినయ్, కళ్యాణ్, వాసు, నితీష్, సురేందర్, కార్తీక్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

హన్మకొండ: ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని సీపీఐ (ఎంఎల్) రెవల్యూషనరీ ఇన్షియేటివ్ హనుమకొండ జిల్లా బాధ్యులు అర్షం అశోక్, ఎండీ ఉస్మాన్ పాషా, పరకాల తిరుపతి, కె.లక్ష్మయ్య, ఉమ విమర్శించారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో వివిధ డిమాండ్లతో కూడిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజాసమస్యలపై ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించి చైతన్యం కలిగించనున్నట్లు తెలిపారు.

అకాల వర్షంతో పంటల నష్టం బాధితులను ఆదుకోవాలి

శనివారం రాత్రి కురిసిన వర్షానికి హనుమకొండ జిల్లాలోని ఆత్మకూరు, ఐనవోలు, దామెర, ధర్మసాగర్ మండలాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రహదారులపై చెట్లు నేలకూలాయి. పెంకుటిళ్లు దెబ్బతిన్నాయి. పిడుగుపాటు వల్ల పశువులు మృతి చెందాయి.



కమలాపూర్ : నేలవాలిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతులు

ఎడతెరిపి లేని వర్షం

ఆత్మకూరు : మండలంలో శనివారం రాత్రంతా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. గాలివాన బీభత్సానికి మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కజొన్న, ఇతర పంటలకు నష్టం వాటిల్లింది. అక్కంపేట, నాగయ్యపల్లె శివార్లలో పంటలు నేలవాలాయి.

ట్రాఫిక్ జామ్

ఐనవోలు : ఈదురు గాలులతో కూడిన వర్షం కురవగా మండలంలోని పున్నేలు క్రాస్ సమీపంలోని వరంగల్–ఖమ్మం రహదారిపై అడ్డంగా మూడు చెట్లు పడిపోగా ట్రాఫిక్ జామ్ అయింది. మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోగా సుమారు రెండు గంటల పాటు వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

అపార నష్టం

దామెర : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం తెల్లవారుజామున కురిసిన వడగళ్లవాన రైతులకు అపార నష్టం మిగిల్చింది. ముఖ్యంగా మొక్కజొన్న, మిరప, అరటి, వరితోపాటు పలు రకాల కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. పలు గ్రామాల్లో రేకుల ఇళ్లు ధ్వంసమయ్యాయి. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి వంగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఏఈ గుర్రం రమేష్ మరమ్మతులు చేయించి పునరుద్ధరించారు.



ఐనవోలు : రోడ్డుపై నిలిచిన భారీ వాహనాలు

ధర్మసాగర్ : ధర్మసాగర్, వేలేరు మండలాల్లో మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిన్నాయి. ధర్మసాగర్ మండలంలో చేతికొచ్చిన పంటలు నీట మునిగాయి. వరి పొలాలు నేలవాలి గింజ రాలింది.

కమలాపూర్ : అకాల వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో పాలు పోసుకునే దశలో ఉన్న మొక్కజొన్న పంట నేలవాలగా మిరప, మామిడి తోటలు సైతం దెబ్బతిని కాయ నేలరాలింది.



ధర్మసాగర్ : అకాల వర్షానికి దెబ్బతిన్న వరి పంట



దామెర : ఊరుగొండలో నేలవాలిన అరటి గెల



పంటలను పరిశీలిస్తున్న ఏఐకేఎస్ నాయకులు

పంటలు నష్టపోయిన బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏఐకేఎస్, ఇతర సంఘాల, కాంగ్రెస్, సీపీఎం, తదితర పార్టీల నాయకులు డిమాండ్ చేశారు.

ఐనవోలు : శనివారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను, ఇళ్లు కూలిపోయిన ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం అందించి ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా ఉపాధ్యక్షుడు బండి పర్వతాలు డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో అకాల వర్షానికి దెబ్బతిన్న మక్కజొన్న, వరి, మామిడి, కూరగాయల, ఇతర పంట పొలాలను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడారు. పంట చేతికొచ్చే సమయంలో అకాల వడగండ్ల వర్షం కురవడంతో పంటలు దెబ్బతిన్నాయని రైతులు భారీగా నష్టపోయారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మడిగె నాగరాజు, మోకిరి మోహన్‌రావు, నారాయణరెడ్డి, సల్ల రవీందర్, ముత్తినేని రాజు, గుండెకారి శ్రీనాథ్, నర్సయ్య, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే సర్వే చేయాలి : సీపీఎం

అకాల వర్షాల వల్ల జరిగిన పంటల, ఇతర నష్టంపై వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సత్వరమే సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి లింగయ్య డిమాండ్ చేశారు.



ఎల్కతుర్తి : పంటను పరిశీలిస్తున్న జేఎస్‌ఆర్

ఎల్కతుర్తి : మండలంలోని చింతలపల్లి, దామెర గ్రామాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న, వరి పంటలను బీజేపీ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకుడు జన్నారపు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించి బాధిత రైతులను పరామర్శించి మాట్లాడారు. వందలాది ఎకరాల్లో పొగాకు, మొక్కజొన్న, వరి, ఇతర పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి, నాయకులు పృధ్వీరాజ్, ఆడెపు శ్రీవర్ధన్, చిదురాల వెంకటేష్, మధుకర్, సోలంకీ రాజేశ్వర్‌రావు, బీట్ల లింగయ్య, వాంకె రవిందర్, కనుకయ్య, పాటి భగవాన్, రాజేశ్వర్‌రావు, శివాజీ తదితరులున్నారు.

ఐనవోలు : మండలంలోని గర్మిళ్లపెల్లి గ్రామంలో దెబ్బతిన్న పంటలను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బీరం దేవేందర్‌రెడ్డి సందర్శించారు. అనంతరం పిడుగు పాటుకు గురై ఆవు మృతి చెందగా బాధిత రైతు లింగయ్యను పరామర్శించారు.

ఆత్మకూరు : మండలంలోని అక్కంపేట, నాగయ్యపల్లె శివార్లలో దెబ్బతిన్న పంటలను కాంగ్రెస్ శ్రేణులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్ మాట్లాడారు.

దామెర : పంట నష్టం వాటిల్లిన పంట పొలాలను మండల రైతు బంధు కోఆర్డినేటర్ బిల్లా రమణారెడ్డి, ఎంపీపీ కాగితాల శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడారు.

వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం

ధర్మసాగర్ : మండలంలోని ముప్పారం గ్రామ శివారులోని శ్రీ ముఖ్యనాథస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ పందేన మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని పట్నాలు వేసి బోనాలు సమర్పించారు. సర్పంచ్ గోనెల సమ్మక్క, ఉపసర్పంచ్ వేములకొండ రజిత, ఆలయ కమిటీ చైర్మన్ శివసాని ప్రవీణ్ రవీంద్ర, వైస్ చైర్మన్లు పల్లె రమేష్, పొనవేని నారాయణ, కొన్నె రవీందర్‌రెడ్డి, దారపు రాములు, గుంటిపల్లి సంపత్‌కుమార్, కార్యదర్శి ఎతిరాజుల నర్సింహస్వామి, ఎతిరాజుల యాదగిరి, దారపు ప్రవీణ్, అన్నం అశోక్, ముంజ సాయి, ఒగ్గు పూజారులు గుంటి రవి, గడ్డం రాజయ్య, పేరం యాదగిరి, గడ్డం అనిల్, ముత్యాల రాజు, గుంటి వైకుంఠం, గడ్డం చందు, కుల పెద్దలు ఎం.శ్రీనివాస్, ముంజ వెంకట్రాజం, మర్రిపెల్లి బక్కన్న, చెల్లోజు నాగభూషణం, కందారపు రామకృష్ణ, అన్నం లక్ష్మినారాయణ, కందుకూరి శంకర్ పూజలు నిర్వహించారు.



పట్నం వేస్తున్న ఒగ్గు పూజారులు

'సీపీ, ఎమ్మెల్సీ' ఫ్లెక్సీకి పాలాభిషేకం

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) ఏవీ.రంగనాథ్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు (మూగ) నోముల వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం పాలాభిషేకం చేశాడు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి కుటుంబీకులు మీడియాతో మాట్లాడారు. వేణుగోపాల్‌రెడ్డికి చెందిన 30 గుంటల వ్యవసాయ భూమి విషయంలో కొన్నేళ్లుగా పొరుగు వారితో నెలకొన్న వివాదాలు గ్రామంలో ఎన్నిసార్లు పంచాయతీ నిర్వహించినా పరిష్కారం కాకపోవడంతో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సూచన మేరకు సీపీ రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ క్రమంలో సీపీ ఆదేశాలతో డీసీపీలు మురళీధర్, పుష్ప, ఏసీపీలు తిరుమల్, శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో విచారణ చేసి సీపీకి నివేదిక అందించడంతో భూమి వేణుగోపాల్‌రెడ్డికి దక్కిందని చెప్పారు. భూవివాదం విషయంలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, సీపీ రంగనాథ్ చొరవ తీసుకోవడం వల్లే తమ భూమి తమకు దక్కిందంటూ వారికి వేణుగోపాల్‌రెడ్డి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.



ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

ప్రమాదకరంగా వ్యవసాయ బావులు

ధర్మసాగర్ : మండలంలోని సాయిపేట నుంచి వేలేరు మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన పలు వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయని వేలేరు ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ తెలిపారు. సాయిపేట శివారులో రహదారి పక్కన ఉన్న బావులను ఆయన ఆదివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. వేలేరు సర్పంచ్ కాయిత మాధవరెడ్డి శనివారం రోడ్డు పక్కనున్న వ్యవసాయ బావిలో పడి గాయాలపాలైన ఘటనలో ఆయనకు ఈత రావడంతో ప్రాణాపాయం తప్పిందని తెలిపారు. వేలేరు మండల కేంద్రానికి డబుల్ బీటీ రోడ్డు వేసినా రోడ్డు పక్కనున్న వ్యవసాయ బావుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదని ఆందోళన వెలిబుచ్చారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న బావుల వద్ద చెట్లు ఏపుగా పెరిగి బావులు కనిపించని దుస్థితి నెలకొందని చెప్పారు. ఇకనైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి వ్యవసాయ బావుల వద్ద, ప్రమాదాలు జరిగే అవకాశమున్న చోట్లలో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు ప్రశాంత్, సలీం మాలిక్, రాజు, సురేష్, కరుణాకర్, చారీ, అనిల్, మధు తదితరులున్నారు.



బావిని పరిశీలిస్తున్న సద్దాం హుస్సేన్

విగ్రహావిష్కరణ కమిటీ ఎన్నిక

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లి గ్రామంలో ప్రతిష్ఠించనున్న అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపణ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా బండి అశోక్, గౌరవ అధ్యక్షుడిగా కుందూరు సాంబారెడ్డి, కోశాధికారిగా జట్టి రాజేందర్, సలహాదారులుగా కుమారస్వామి, సురేందర్, రవిపాల్, శంకర్, ఇంద్రారెడ్డి, రాజేందర్, బండి రజనీకుమార్, జయశంకర్‌తో పాటు మరో పది మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

హన్మకొండ చౌరస్తా: రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన బీసీ 'ఏ' కులాలు హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని వరంగల్ జిల్లా గంగపుత్ర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ పాక వెంకటేశ్వర్లు సూచించారు. హనుమకొండలోని కాకతీయ కాలనీలోని గంగాగార్డెన్‌లో విద్యార్థులు, యువత, రీసెర్చ్ స్కాలర్స్‌ల బీసీ 'ఏ' ఐక్య కులాల ఉద్యమ సమితి ప్రథమ సమావేశం గైని రాజేందర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీసీ కమిషన్‌ను ముదిరాజ్‌లు రాజకీయంగా ప్రభావితం చేస్తూ బీసీ 'ఏ' గ్రూపులో చేరేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా బీసీ 'ఏ కులాల ఐక్య కార్యాచరణ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకుడు సాయిబాబా, గోపు సుధాకర్, డాక్టర్ సనత్, పాక శ్రీనివాస్, చంద్రగిరి నర్సింహస్వామి, ఆనందం, పల్లెపు సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రభుత్వ వైఫల్యంతోనే ప్రశ్నపత్రాల లీక్

- మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య

ఎల్కతుర్తి : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే గ్రూప్–1 ప్రశ్నాప్రతాలు లీకయ్యాయని మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ నేత సిరిసిల్ల రాజయ్య అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆదివారం ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అలాగే హనుమకొండ–కరీంనగర్ జాతీయ రహదారిపై ధర్నా చేసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడారు. ప్రశ్నాపత్రాల లీకేజీకి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని, సీబీఐతో విచారణ చేయించి బాధ్యులందరినీ వెంటనే అరెస్ట్ చేయాలని, అర్హత సాధించిన అభ్యర్థులకు నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుకినె సంతాజీ, సర్పంచ్‌లు చల్లా రవీందర్ రెడ్డి, దాట్ల రాముడు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ : మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్ మాట్లాడగా ఎంపీటీసీ జాలిగపు వనమాల, పీఏసీఎస్ డైరెక్టర్ బొడ్డు లెనిన్, నాయకులు జాలిగపు దుర్గయ్య, ఠాకూర్ ఉమ, అంకం రాజకుమారి, జాలిగపు లక్ష్మి, కొంతం కొమురమ్మ, గంటి శ్రీనివాస్, కొలిపాక గణేష్, వాసిరెడ్డి అజిత్‌రెడ్డి, పాతపెల్లి సతీష్, విజయ్, కన్నల్ పాల్గొన్నారు.



ఎల్కతుర్తి : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న శ్రేణులు

శాయంపేట : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి మాట్లాడగా నాయకులు చిందం రవి, హైదర్, మామిడిపల్లి సాంబయ్య, రమేష్, రాజ్‌కుమార్, రవిపాల్, రాజు, వెంకట్, రాజీరెడ్డి, రజనీకాంత్, జగన్, చిరంజీవి, విష్ణు పాల్గొన్నారు.

ఐనవోలు : మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి సెంటర్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల నాయకుడు సమ్మెట మహేందర్ మాట్లాడగా నాయకులు కూస చిరంజీవిరెడ్డి, రఫీ, కొత్తూరు సునీల్, గ్యాదరి భాస్కర్, ఇల్లందు ఎలీషా, రహీం పాషా, బరిగెల స్వామి, కట్కూరి బాబు, ఇల్లందుల సారయ్య, మానుపాటి రాజు, రాజారపు వెంకన్న, నోముల కుమార్, కొత్తూరి ప్రతాప్, ఎరుకుల భాస్కర్, రహీం ఖాన్, చాంద్ పాషా, అశోక్, అరూరి అశోక్, తదితరులు పాల్గొన్నారు.



కమలాపూర్ : కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమలాపూర్ : కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలను దహనం చేశారు. అనంతరం ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుండపు చరణ్ పటేల్ మాట్లాడగా జిల్లా ఉపాధ్యక్షుడు అయిలయ్యగౌడ్, మీడియా కోఆర్డినేటర్ వాసాల శ్రీనివాస్, నాయకులు భిక్షపతి, లింగయ్య, కనకరత్నం, కృష్ణమూర్తి, రవికాంత్, నోమేశ్వర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నడికూడ : మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేసీఆర్, కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ మాట్లాడగా నాయకులు తాళ్ల నవీన్, అప్పం కుమారస్వామి, సాంబయ్య, చిన్ని, బాలరాజు, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఎగ్జామ్ ప్యాడ్లు, జామెట్రీ బాక్స్‌ల అందజేత



ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు కేరింగ్ హ్యాండ్స్ టుగెదర్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రూ.6 వేలు విలువైన ఎగ్జామ్ ప్యాడ్స్, జామెట్రీ బాక్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్ పొన్నాల రాజు మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, జామెట్రీ బాక్స్‌లు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు తోడ్పాటు అందించడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజ్‌కుమార్‌కు హెచ్‌ఎం ప్రతాప రత్నకుమార్, ఎస్ఎంసీ చైర్మన్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎం కమిటీ సభ్యులు ఆనంద్, రవి, రాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మధు, యాదయ్య, వెంకటనారాయణ, తల్లిదండ్రులు రాజు, శేఖర్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించే వరకూ పోరాటం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సతీష్

ఆత్మకూరు : ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించే వరకు పోరాటం కొనసాగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ తెలిపారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల సంగ్రామ యాత్ర మండల కేంద్రానికి ఆదివారం చేరుకుంది. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ఎస్సీ వర్గీకరణ పట్ల మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే పార్లమెంటులో బిల్లు పెట్టి ఆమోదిస్తామని బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోదీ ఎన్నికలకు ముందు మంద కృష్ణకు స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తుచేశారు. మాదిగలను, ఉపకులాలను నమ్మించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడుస్తున్నా పార్లమెంటులో బిల్లు పెట్టకుండా తాత్సారం చేయడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును ప్రజల్లో ఎండగడుతూ పాదయాత్ర కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రానున్న అన్ని ఎన్నికల్లోనూ మాదిగ, ఉపకులాల ప్రజలు బీజేపీకి గుణపాఠం చెప్పాలని కోరారు. బీజేపీ భూస్థాపితం కాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ములుగు జిల్లా కన్వీనర్ పుల్లూరు కరుణాకర్, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముక్కెర ముఖేష్, నాయకులు వాసంపెల్లి చైతన్య, పేరాల బలరామ్, సతీష్, విజయ్, రాంబాబు పాల్గొన్నారు.



ఆత్మకూరు : మాట్లాడుతున్న సతీష్

దామెర : మండలంలోని ఊరుగొండకు మాదిగల సంగ్రామ యాత్ర చేరుకోగా బీఆర్‌ఎస్ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ మాట్లాడారు. ఏప్రిల్ 4న తలపెట్టిన బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు, కోఆర్డినేటర్ గంగారపు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్, ఇన్‌చార్జ్ పరిమళ శ్రీధర్, నాయకులు కరుణాకర్, ముఖేష్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఖిలా వరంగల్: వరంగల్ నగరంలోని ఉర్సు ప్రాంతంలోని కరీమాబాద్‌లోని వేంకటేశ్వర ప్రభుత్వ ఆమోదిత ఉన్నత పాఠశాలలో 1996 – 97 పదవ తరగతికి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాడు చదువు చెప్పిన గురువులను ఘనంగా శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కంచి చందు, నాగేందర్, నెల్ల రాజు, సురేష్, సీహెచ్.రాజు, ఆకుతోట రాజు, నూర కవిత తదితరులు పాల్గొన్నారు.

రామనాథం సేవలు చిరస్మరణీయం



ఖిలా వరంగల్: తెలంగాణ ఉద్యమ నేత, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రామనాథం సార్ సేవలు చిరస్మరణీయమని బీజేపీ నాయకుడు గంట రవికుమార్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్ కొనియాడారు. వరంగల్ ఫోర్ట్ రోటరీ క్లబ్ భవనంలో తాళ్లపల్లి రామనాథం, సులోచన దంపతుల ప్రథమ వర్ధంతి సభ ఆదివారం జరిగింది. రామనాథం దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ నేతలకు రామనాథం మార్గదర్శకులుగా నిలిచారు. సబ్బండ జాతిని ముందు నడిపించిన మహనీయుడని గుర్తుచేశారు. కార్యక్రమంలో న్యాయవాది జీవన్ గౌడ్, శ్రీధర్‌గౌడ్, తాళ్లపెల్లి శ్రీనివాస్, రవి, గుర్రం రవి, కుమారస్వామి, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.రమేష్, పూర్ణచందర్ పాల్గొన్నారు.